క్లుప్తంగా

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడికి ఘన స్వాగతం

మధురపూడి: జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్యకు శనివారం రాజమహేంద్రవరం విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. రాజమహేంద్రవరంలో జరిగిన హలో బీసీ–చలో రాజమహేంద్రవరం సభకు ఆయన హైదరాబాద్ నుంచి విమానంలో వచ్చారు. మధురపూడి ఎయిర్‌పోర్టులో ఆయనకు ఆ సంఘం నాయకులు స్వాగతం పలికారు. ఎయిర్‌పోర్టు నుంచి ఆయన రోడ్డు మార్గం గుండా రాజమహేంద్రవరం వెళ్లారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు గడువు పొడిగింపు

గోకవరం: మండలంలోని వీరలంకపల్లి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో 2023–24 విద్యాసంవత్సరంలో ఐదో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తు గడువు పొడిగించినట్టు ప్రిన్సిపాల్ కేఎంవీ రాణి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. నోటిఫికేషన్ ప్రకారం దరఖాస్తులకు ఈ నెల 23తో గడువు ముగియగా ప్రభుత్వం ఈ నెల 31 వరకూ పొడిగించిందన్నారు. నాల్గో తరగతి, పదో తరగతి విద్యార్థినులు ఈ ప్రవేశ పరీక్షకు అర్హులన్నారు. అర్హులైన విద్యార్థుల ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నేటి నుంచి వైఎస్సార్ ఆసరా గ్రామ సభలు

పెదపూడి: వైఎస్సార్ ఆసరా మూడో విడత నగదు పంపిణీకి సంబంధించి గ్రామ సభలను ఈ నెల 26 నుంచి ఏప్రిల్ 4 వరకు నిర్వహించనున్నట్లుగా వైఎస్సార్ క్రాంతి పథం మండల ఇన్‌చార్జి ఏపీఎం చినబాబు శనివారం తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి ఈ నెల 26న రామేశ్వరం, పైన గ్రామాల్లో గ్రామ సభలు ప్రారంభిస్తారన్నారు. 27న ఏపీ త్రయం, రామేశ్వరం, 28న జి.మామిడాడ, పెద్దాడ, 29న కరకుదురు, దోమాడ, 31న గండ్రేడు, కుమారప్రియం, ఏప్రిల్ 1న కైకవోలు, పెదపూడి, 2న కాండ్రేగుల, శహపురం, 3న పుట్టకొండ, సంపర, 4న చింతపల్లి, వేండ్ర గ్రామాల్లో గ్రామసభలు జరుగుతాయన్నారు. వివిధ శాఖాధికారులు, మహిళలు, ప్రజలు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

కల్యాణ వేంకటేశ్వరుని నిజపాద దర్శనం


ప్రత్యేక అలంకరణలో కల్యాణ వేంకటేశ్వరస్వామి

బిక్కవోలు: మండలంలోని కొంకుదురు గ్రామం బుడతల మామిడి వద్ద ఉన్న నాంచారమ్మ పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామిని అర్చకులు రమణశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా అలంకరించారు. శనివారం వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్వామివారు నిజపాద దర్శనమిచ్చారు. తొలుత గోపూజ, హోమాలను చేశారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు విద్యార్థుల ఎంపిక


విద్యార్థినులతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

సీతానగరం: కాటవరం ఎంపీయూపీ స్కూల్ విద్యార్థులు నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షకు ఎంపికైనట్టు హెచ్‌ఎం టి.వెంకటలక్ష్మి, ఉపాధ్యాయులు జి.దుర్గాప్రసాద్ తెలిపారు. శనివారం స్థానిక ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ ఏడాది ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలకు ఎనిమిదో తరగతి విద్యార్థులు అనిమెల్లి సంజన, బుంగా పూజిత, మానుపాటి లక్ష్మీదుర్గ ఎంపికయ్యారని తెలిపారు. వారిని ఎంఈఓ కె.స్వామినాయక్, ఉపాధ్యాయులు, స్థానికులు అభినందించారు.

ముగ్గురు విద్యార్థుల ఎంపిక

రంగంపేట: వడిశలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు జాతీయ ఉపకార వేతనాలకు అర్హత సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వీవీఎస్ఎస్ ప్రసాద్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఎనిమిదో తరగతి చదువుతున్న ఆత్కూరి లక్ష్మీప్రియాంకర్, పాలా హేమసుందరకృష్ణ, ఉయ్యూరి దేవి మౌనికలు అర్హత సాధించారన్నారు. విద్యార్థులను గ్రామ సర్పంచ్ కొల్లాటి శ్యామలావతి, పాఠశాల ఉపాధ్యాయులు సంధ్యారాణి, మదీనా భాషా, ఎస్ఎంసీ చైర్మన్ కొడవళ్ల రామవిష్ణురాంబాబు అభినందించారు.

నేటి నుంచి ధ్వజస్తంభ ప్రతిష్ఠా కార్యక్రమాలు

బిక్కవోలు: మండలంలోని తొస్సిపూడి గ్రామంలో వరసిద్ధి వినాయకుని ఆలయం వద్ద ఆదివారం ధ్వజ స్తంభ ప్రతిష్ఠా కార్యక్రమాలు ప్రారంభించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యుడు తేతలి జగ్గిరెడ్డి తెలిపారు. ఆది, సోమవారాల్లో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేయనున్నట్లుగా చెప్పారు. సోమవారం ఉదయం 9.45 గంటలు ప్రతిష్ఠా కార్యక్రమం జరుగుతుందని, అనంతరం అన్నసమారాధన నిర్వహిస్తామన్నారు.

ఆదమరిస్తే ప్రమాదమే

విద్యుత్ వినియోగంలో జాగ్రత్తలు తప్పనిసరి


రంగంపేట విద్యుత్ సబ్‌స్టేషన్

రంగంపేట: రోజువారీ జీవితంలో విద్యుత్ ఎంత అవసరమో ఆదమరిస్తే అంతకన్నా ఎక్కువ ప్రమాదాలే జరుగుతుంటాయి. రోజురోజుకీ పెరుగుతున్న వినియోగంతో పాటు ప్రమాదాలు సంఖ్య కూడా పెరుగుతూనే ఉంది. వేసవిలో పెరిగిన ఉష్ణోగ్రతలకు అనుగుణంగా విద్యుత్ వినియోగం అధికమైంది. గృహోపకరణాల వైరింగ్‌లో లోపాలు, విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గుల కారణంగా వినియోగదారులకు తెలియకుండానే నష్టం జరుగుతుంది. చిన్నవే కదా అని ఆదమరిస్తే ఊహించని రీతిలో నష్టపోవాల్సి వస్తోంది.

అప్రమత్తంగా ఉండాలి

విద్యుత్ వినియోగించేటప్పుడు భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలి. విద్యుత్ ఉపకరణాల మరమ్మతులు, వైర్లు సరిచేయడం తదితర పనులు సొంతంగా చేయడం మంచి పద్ధతి కాదు. పైగా ధరల విషయంలో వెనకడుగు వేసి నాసిరకం ఉపకరణాలు, వైర్లు తీసుకుంటే ప్రమాదాలను కొనితెచ్చుకున్నట్టే. వేసవిలో అయితే మరింత అప్రమత్తంగా ఉండాలి. తీగలు వేడెక్కే అవకాశం ఉండటంతో ఈ సమయంలో ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉంటుంది. ప్రధానంగా ఇంటికి వాడే విద్యుత్తు తీగలు పరికరాలు ఐఎస్ఐ మార్క్ ఉన్న వాటినే వినియోగించాలి. విద్యుత్ లోడ్ అంతా ఒకే ఫ్యూజ్‌పై పడకుండా చూసుకోవడం మంచిది. విద్యుత్ వినియోగించే ఉపకరణాలను బట్టి తగిన సామర్థ్యమున్న తీగలు, పరికరాలు వినియోగించాలి. ఇళ్లల్లో లోడ్ సర్క్యూట్ బ్రేకర్లు వేసుకుంటే అధిక లోడ్ వచ్చినప్పుడు ట్రిప్ చేసి ప్రమాదాన్ని హెచ్చరిస్తాయి. రంగంపేట మండలంలో 15,748 గృహ విద్యుత్ కనెక్షన్లు ఉండగా, 20,189 వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయి. కమర్షియల్ 1,150, ఇండస్ట్రీలు 72, పౌల్ట్రీలు 360 మొత్తం కనెక్షన్లు 19,515 ఉన్నాయి.

జాగ్రత్తలు తీసుకోవాలి



ఇళ్లల్లో ప్రమాదకరంగా ఉన్న పాత వైరింగ్‌ను మార్చి కొత్తగా వైరింగ్ చేయించుకోవాలి. విద్యుత్ పనుల్లో తర్ఫీదు పొందిన ఎలక్ట్రీషియన్ చేతనే వైరింగ్ చేయించుకోవాలి. సరైన ఎర్త్ లేకపోతే విద్యుత్ ఉపకరణాలు దెబ్బతినే ప్రమాదముంది. ఒకే చోట ఎక్కువ ప్లగ్‌లు వినియోగించడం వల్ల కూడా ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. అందుకే వినియోగదారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.
– సీహెచ్ నాగేశ్వరరావు, ఏఈ, రంగంపేట

అక్కచెల్లెమ్మలకు 'ఆసరా'గా నిలుస్తున్న సీఎం జగన్


సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న పొదుపు సంఘాల మహిళలు


కార్యక్రమానికి హాజరైన మహిళా సంఘాల సభ్యులు

- ఎంపీ మార్గాని భరత్‌రామ్
- ఆసరా మూడో విడత సాయం చెక్కును మహిళా సంఘాలకు అందచేసిన ఎంపీ, కలెక్టర్, ఎమ్మెల్యేలు

అనపర్తి: మహిళా అభ్యున్నతికి పెద్దపీట వేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా అక్కచెల్లెమ్మలకు ఆసరాగా నిలుస్తున్నారని రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. శనివారం స్థానిక తేతలి రామిరెడ్డి, మంగాయమ్మ కళావేదిక ప్రాంగణంలో వైఎస్సార్ ఆసరా మూడో విడత కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీ భరత్‌రామ్ మాట్లాడుతూ మహిళలను సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా శక్తివంతులను చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కృషిచేస్తోందన్నారు. మహిళా లోకం జగనన్నను ఆశీర్వదిస్తుంటే చూడలేని ప్రతిపక్ష పార్టీలు ప్రభుత్వంపై బురదచల్లే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. మరో ముఖ్య అతిథి జిల్లా కలెక్టర్ కె.మాధవీలత మాట్లాడుతూ మహిళా సాధికారతతోనే ప్రగతి సాధ్యమని నమ్మిన రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని పథకాల్లో మహిళలను భాగస్వాములు చేస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు అన్ని సామాజిక రంగాల్లో మహిళల అభివృద్ధికి రాష్ట్రం ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని చెప్పారు. సుదీర్ఘ పాదయాత్రలో పొదుపు సంఘాల మహిళలకు ఇచ్చిన హామీకి అనుగుణంగా వారిని ఆదుకునేందుకు వైఎస్సార్ ఆసరా పథకంతో అండగా నిలిచారని తెలిపారు. డీఆర్‌డీఏ పీడీ ఎస్.సుభాషిణి మాట్లాడుతూ ఆసరా పథకం కింద జిల్లాలో రూ.975 కోట్లు పొదుపు సంఘాల మహిళల ఖాతాల్లో ప్రభుత్వం నేరుగా సాయాన్ని జమ చేస్తుందన్నారు. మూడో విడత ఆసరాలో భాగంగా మండల పరిధిలో 1,310 సంఘాలకు మంజూరైన రూ.11.77 కోట్ల ఆర్థిక సాయం నమూనా చెక్కును ఎంపీ భరత్‌రామ్, కలెక్టర్ మాధవీలత, ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డిలు మహిళలకు అందజేశారు. అనంతరం పొదుపు సంఘాల మహిళలు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి, ఎంపీపీ అంసూరి సూర్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు సత్తి గీతావరలక్ష్మి, సర్పంచ్ వారా కుమారి, బిక్కవోలు జెడ్పీటీసీ రొంగల పద్మావతి, కొవ్వూరి సత్యనారాయణరెడ్డి, రిమ్మలపూడి వెంకటేశ్వరరావు, షణ్ముఖి చిట్టి ఆనందరాజు తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాల వృద్ధికి యూత్ ఫెస్ట్‌లు దోహదం


సాంస్కృతిక కార్యక్రమాల్లో సందడి చేస్తున్న విద్యార్థులు

రాజానగరం: విద్యార్థుల్లో కమ్యూనికేషన్ స్కిల్స్, ఆర్గనైజింగ్ స్కిల్స్, డెసిషన్ మేకింగ్ వంటి నైపుణ్యాలను అభివృద్ధి చేసుకునేందుకు యూత్ ఫెస్ట్‌లు, టెక్నికల్ ఫెస్ట్‌లు తోడ్పడతాయని నన్నయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య టి. అశోక్ అన్నారు. యూనివర్సిటీలో కామర్స్ అండ్ మేనేజ్మెంట్ విభాగం ఆధ్వర్యంలో 'సవిస్కార 2 కే 23' పేరిట నిర్వహించిన మేనేజ్‌మెంట్ ఫెస్ట్‌ని శనివారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఇటువంటి కార్యక్రమాలలో పాల్గొనడం ద్వారా ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకోవడంతోపాటు కొత్త ఆలోచనలతో నూతనావిష్కరణలకు ప్రేరణ కలుగుతుందన్నారు. అనంతరం అకడమిక్ ఈవెంట్స్‌లో భాగంగా స్పర్థా, యాడ్ మేడ్, బుల్ వజ్ బేర్, ప్లానో, అడ్మినార్, అడ్మెంటార్, టవర్ బిల్డింగ్, సెల్ఫీ టూరిజం, ఫన్ అండ్ మైండ్ గేమ్స్ వంటి వాటిని నిర్వహించారు. డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ ప్రొగ్రామ్ కోఆర్డినేటర్‌గా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో గోదావరి జిల్లాలోని అనుబంధ కళాశాలల నుంచి పెక్కుమంది కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ కోర్సు చదువుతున్న విద్యార్థులు హాజరయ్యారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఏపీ పేపర్ మిల్లు జీఎం (టెక్నికల్) చక్రపాణి, అకౌంటెంట్ బ్రహ్మానందం, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.టేకి, డాక్టర్ పి.ఉమామహేశ్వరిదేవి, డాక్టర్ రాజేంద్రప్రసాద్, డాక్టర్ ఎ.శ్రీపద్మవల్లీ, తదితరులు పాల్గొన్నారు.

వృత్తిపై నిబద్ధత ఉండాలి

రాజానగరం: వృత్తిపై నిబద్ధత, పనిపై ఆసక్తి, శ్రమించే స్వభావం ఉంటే జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని ఏపీ నర్సింగ్ అండ్ మిడ్ వైఫ్ కౌన్సిల్ రిజిస్ట్రార్ కొత్తపల్లి సునీల అన్నారు. జీఎస్ఎల్ వైద్య కళాశాలలో జీఎస్ఎల్, స్వతంత్య నర్సింగ్ కళాశాలల లాంప్ లైటింగ్, గ్రాడ్యుయేషన్ సెర్మనీ కార్యక్రమం శనివారం రాత్రి జరిగింది. రోగుల జీవితాల్లో వెలుగులు పంచిన ఫ్లారెన్స్ నైటింగేల్ జ్ఞాపకంగా కొవ్వొత్తుల ప్రదర్శన ఇచ్చారు. అనంతరం ఉభయ కళాశాలలో గ్రాడ్యుయేషన్, పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన 200 మంది నర్సింగ్ విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో జీఎస్ఎల్ చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం

సీతానగరం: ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీపై పార్లమెంట్‌లో అనర్హత వేటు వేయడంపై నిరసనగా యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అయిల శేషగిరి ఆధ్వర్యంలో దేశ ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. శనివారం సీతానగరం మూడు బొమ్మల సెంటర్ వద్ద కాంగ్రెస్ నాయకులు నిరసన తెలిపారు. కుట్రతో రాహుల్‌పై వేటు వేశారన్నారు. రాష్ట్ర కార్యదర్శి వంశీ కిరణ్, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు దూలం కిషోర్, పిర్ల సురేష్, దూలం అరుణ్ తేజ, శీలం రామకృష్ణ, దార సురేష్, మట్ట రాము పాల్గొన్నారు.

ఐఓసీఎల్, హెచ్‌పీసీఎల్ ఆధ్వర్యంలో మాక్ డ్రిల్


మాక్‌డ్రిల్ సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాస్

గోకవరం: మండలంలోని గుమ్మళ్లదొడ్డి ఐఓసీఎల్ ప్లాంట్‌లో శనివారం ఐఓసీఎల్, హెచ్‌పీసీఎల్ సంయుక్తంగా మాక్‌డ్రిల్ లెవల్–3 నిర్వహించారు. ఐఓసీఎల్‌కు చెందిన పారాదీప్ హైదరాబాద్ పైప్‌లైన్, హెచ్‌పీసీఎల్‌కు చెందిన విశాఖ, విజయవాడ, సికింద్రాబాద్ పైప్‌లైన్ జిల్లాలోని వివిధ గ్రామాల మీదుగా వెళుతున్నాయి. ఈ సందర్భంగా ఆయా ప్లాంట్లలో ఏమైనా ప్రమాదం జరిగితే ఏ విధంగా నివారిస్తారు, ఏ విధమైన చర్యలు తీసుకుంటారు, సమీపంలోని ప్రజలను అప్రమత్తం చేయడం, ఇతర అంశాలను ఈ మాక్‌డ్రిల్‌లో కళ్లకు కట్టినట్టు చూపించారు. అనంతరం ఐఓసీఎల్ పైప్‌లైన్ ఇన్‌చార్జి టి.సాయికిశోర్, హెచ్‌పీసీఎల్ పైప్‌లైన్ ఇన్‌చార్జి ప్రఫుల్ల రంగరి ఆయా ప్లాంట్లలో చేపడుతున్న భద్రతా నియమాలు, నిబంధనలపై అవగాహన కల్పించారు. అత్యవసర సమయాల్లో ప్రజలకు కలిగే సందేహాలను నివృత్తి చేసేందుకు, ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేయడానికి ఈ మాక్ డ్రిల్ ఉపయోగపడుతుందని తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ తెలిపారు. ఫైర్ సేఫ్టీ అధికారి ఎస్.గోపికృష్ణ, ఆయా ప్లాంట్ల సిబ్బంది, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

యువత సేవాభావంతో మెలగాలి

- వ్యవసాయ కళాశాల డీన్ డాక్టర్ సీహెచ్ శ్యాంరాజ్ నాయక్
- తొర్రేడులో ప్రారంభమైన ఎన్ఎస్ఎస్ సేవా శిబిరం

రాజమహేంద్రవరం రూరల్: యువత విద్యతోపాటు సేవాగుణం అలవాటు చేసుకోవాలని రాజమహేంద్రవరం వ్యవసాయ కళాశాల డీన్ డాక్టర్ సీహెచ్ శ్యాంరాజ్ నాయక్ అన్నారు. శనివారం తొర్రేడు గ్రామంలో ఆచార్య ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయం అనుబంధ వ్యవసాయ కళాశాల విద్యార్థులు జాతీయ సేవా శిబిరంలో భాగంగా నిర్వహించిన ప్రత్యేక శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా వ్యవసాయ కళాశాల డీన్ సీహెచ్ శ్యాంరాజ్‌నాయక్ మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ సేవా శిబిరం ప్రాధాన్యాన్ని వివరించారు. మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కొత్తపల్లి కేశవరామారావు, బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజర్ శాంతరాజు, డీసీసీబీ సూపర్‌వైజర్ గాజింగం అప్పారావు, తొర్రేడు సొసైటీ సీఈఓ కేవీవీ సత్యనారాయణ, తొర్రేడు సొసైటీ సభ్యులు దండమూడి అర్జునరావు, వ్యవసాయ కళాశాల అధ్యాపకులు డాక్టర్ అమ్మాజీ, డాక్టర్ సాయిగంగాధర్, డాక్టర్ రవికుమార్ మాట్లాడారు. అనంతరం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ హైమజ్యోతి ఆధ్వర్యంలో గ్రామ వీధుల్లో వలంటీర్లు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ సేవా శిబిరాలు ఈనెల 31వ తేదీ వరకూ నిర్వహిస్తున్నట్లు డాక్టర్ హైమజ్యోతి తెలిపారు.

గడప గడపకూ సంక్షేమమే ధ్యేయం

- జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు
- రూ.1.37 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనుల్ని ఎమ్మెల్యేతో కలిసి ప్రారంభం


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు, ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: గడప గడపకూ సంక్షేమం, వీధి వీధి అభివృద్ధే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. మండలంలోని పొలమూరులో రూ.1.37 కోట్ల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులను ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డితో కలిసి జెడ్పీ చైర్మన్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమాభివృద్ధి సీఎం జగనన్నతోనే సాధ్యమని అన్నారు. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో మాజీ సీఎం చంద్రబాబు కుట్రపూరిత రాజకీయాలు చేశారని, ఇది టీడీపీ సాధించిన విజయంగా టీడీపీ అనుకూల ప్రచార మాధ్యమాలు బాజా వాయిస్తున్నాయని ధ్వజమెత్తారు. జిల్లాలో రెండో పంటకు సాగునీటి ఎద్దడి లేకుండా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఒడిశా ప్రభుత్వంతో సంప్రదించి 7 వేల క్యూసెక్కుల నీటిని తెచ్చేందుకు చర్యలు చేపట్టారని తెలిపారు.

రూ.12 కోట్లతో అభివృద్ధి పనులు

గ్రామాలు సుభిక్షంగా ఉన్నపుడే రాష్ట్రం అభివృద్ధి సాధిస్తుందని, దీనికి అనుగుణంగా గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషిచేస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారాన్ని చేపట్టిన తరువాత గతంలో ఎన్నడూ లేని విధంగా పొలమూరులో రూ.12 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు చెప్పారు. పొలమూరులో రక్షిత మంచినీటి ట్యాంక్ ప్రారంభోత్సవానికి సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి సత్తి ఆదిలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, ఎంపీపీ అంసూరి సూర్యనారాయణ, అనపర్తి, పెదపూడి జెడ్పీటీసీలు సత్తి గీతావరలక్ష్మి, పేపకాయల వెంకటలక్ష్మి, సర్పంచ్ గుడాల ధనలక్ష్మి, జిల్లా పరిషత్ మాజీ ప్రతిపక్ష నాయకుడు సత్తి రామారెడ్డి, వ్యాపారవేత్తలు ద్వారంపూడి నారాయణరెడ్డి, సత్తి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

కాలువ పూడ్చిన వారిపై చర్యలు తీసుకోండి

జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యే

రంగంపేట: చాగల్నాడు కాలువను మట్టితో పూడ్చి వేసి పంట పొలంగా మార్చినవారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి జిల్లా కలెక్టర్ మాధవీలతను కోరారు. శనివారం మండలానికి చెందిన పలువురితో కలసి ఆయన కలెక్టర్ మాధవీలతతో మాట్లాడారు. కాలువ పూడ్చివేతకు సంబంధించి పూర్తి వివరాలతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్ మాధవీలతకు ఆయన అందించారు. మెట్టప్రాంతమైన రంగంపేట మండలాన్ని గోదావరి జలాలతో సస్యశ్యామలం చేసేందుకు 2004లో రూ.70 కోట్లతో నిర్మించిన చాగల్నాడు ఎత్తిపోతల పథకం కాలువను పెదరాయవరం–నాయంకపల్లి కల్వర్టు వద్ద సుమారు కిలోమీటరు మేర పూడ్చి వేశారని దీనివల్ల కోటపాడు, వెంకటాపురం, దొడ్డిగుంట, సింగంపల్లి, మర్రిపూడి గ్రామాలకు సాగునీరు అందని పరిస్థితి ఏర్పడిందని కలెక్టర్‌కు ఎమ్మెల్యే వివరించారు. దీనిపై కలెక్టర్ మాధవీలత సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి రిమ్మలపూడి వెంకటేశ్వరరావు, మండల సాగునీటి సాధన కమిటీ కన్వీనర్ పుట్టా సోమన్న చౌదరి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ స్థలాలు పంపిణీ చేస్తాం

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- సేకరించిన భూముల పరిశీలన


వెలుగుబందలో భూములను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: అర్హులైన ప్రతి ఒక్కరికీ నిలువ నీడ కల్పించాలనే సీఎం జగన్ ఆశయమని, దానిని సాకారం చేయడమే తమ కర్తవ్యమని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. మండలంలోని వెలుగుబంద, తూర్పుగానుగూడెంలలో నివాస స్థలాల పంపిణీ కోసం సేకరించిన భూములను శనివారం ఆయన పరిశీలించారు. రాష్ట్రంలో సీఎం జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత సుమారు 35 లక్షల మందికి నివాస స్థలాలు పంపిణీ చేశారన్నారు. నియోజకవర్గంలో 25 వేల మందికి పైగా ఇంటి స్థలాలు అందించామన్నారు. అయితే కొన్ని గ్రామాలలో వివిధ కారణాలతో ఈ పంపిణీ కార్యక్రమం జరుగలేదని, దానిని కూడా సత్వరమే పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వెలుగుబందలో ఇప్పటికే 17.71 ఎకరాల భూమిని గుర్తించి, ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. అలాగే మరో 25 ఎకరాలకు కూడా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఆ ప్రాంతంలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రగతి గురించి కూడా ఆరా తీశారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, తహసీల్దారు పవన్ కుమార్, తదితరులు ఉన్నారు.

జీఎస్ఎల్‌లో ఆప్టోమెట్రీపై సింపోజియం


జీఎస్ఎల్‌లో నిర్వహించిన ఆప్టోమెట్రీపై సింపోజియంలో ఎగ్జిబిషన్ దృశ్యం

రాజానగరం: దేశంలో ఆప్టోమెట్రీ విస్తృతి, అవకాశాలపై రాజానగరంలోని జీఎస్ఎల్ వైద్య కళాశాలలో 'ఐ సేవర్స్ – 2023' పేరుతో శనివారం నిర్వహించిన సింపోజియంలో చర్చించారు. కంటి పరీక్షలు నిర్వహించి, ప్రాథమిక చికిత్సలు చేసే నిపుణుల విభాగాన్ని ఆప్టోమెట్రీ అంటారు. దేశవ్యాప్తంగా ఆప్టోమెట్రీకి పెరుగుతున్న అవకాశాల గురించి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆప్టోమెట్రీ నేషనల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ శివరామ్ మాలె(చత్తీష్‌ఘడ్) వివరించారు. కంటి వైద్యంలో కాంటాక్ట్ లెన్స్ మెయింటెన్స్‌లో డిజిటల్ పరికరాల పాత్ర, ప్రభావాల గురించి జీఎస్ఎల్ ఆప్తమాలిజిస్ట్ సతీష్, పబ్లిక్ హెల్త్‌లో ఆప్టోమెట్రీ పాత్రపై ఎం.చంద్రశేఖర్ (హైదరాబాద్) తెలియజేశారు. కంటి పరీక్ష విధానంలో సాంకేతిక పరిణామాలపై జీఎస్ఎల్ అసిస్టెంట్ ప్రొఫెసర్, సింపోజియం ఆర్గనైజింగ్ సెక్రటరీ నిర్మలాజ్యోతి ప్రెజెంటేషన ఇచ్చారు. ఈ విధంగా ఆప్టోమెట్రీపై సింపోజియంలో చర్చాగోష్ఠి జరగడం రాష్ట్రంలో ఇది మొదటిసారని జీఎస్ఎల్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు తెలిపారు. కంటి పరీక్షలు చేసే విధానం, చికిత్సల పై చిత్రాలతో కూడిన డెలిగేట్స్ సందర్శించారు. ఎగ్జిబిషన్‌ని కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.ఆర్. గురునాథ్, పారామెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ టి. సత్యప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

జగ్గారావు సేవలు మరువలేనివి

పెదపూడి: గ్రామాభివృద్ధికి నిరంతరం కృషి చేసిన మాజీ సర్పంచ్ అద్దంకి జగ్గారావు సేవలు మరువలేనివని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. ఈ నెల 21న సంపర గ్రామంలో జగ్గారావు మృతి చెందిన నేపథ్యంలో ఆయన కుమారుడు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ముక్తేశ్వరరావు, కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు. జగ్గారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ పేపకాయల వెంకటలక్ష్మి, మండల సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు కోసూరి వాసు తదితరులున్నారు. ముక్తేశ్వరరావును తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్, ఉత్తరాంధ్ర జిల్లాల వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి వైవీ సుబ్బారెడ్డి శనివారం ఉదయం ఫోన్లో పరామర్శించారు.